ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 319 గురువారం 14-11-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## కాళోజీకి సిఎం రేవంత్ నివాళి

**అసెంబ్లీలో నివాళి అర్పించిన విప్ నాయక్**



**తొలి సమయం హైదరాబాద్,నవంబర్13:** కాళోజి నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కాళోజి నారాయణరావు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాళోజీని స్మరించుకున్నారు. ఇదిలావుంటే అసెంబ్లీలో కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ తొలి పొద్దు కాళోజి నారాయణ రావు అన్నారు.తెలంగాణ వాడుక భాషలో రచనలు చేసి సాహిత్య రంగంలో విశేష కృషి చేశారన్నారు.తెలంగాణ భాషను,యాసను ఆదరించాలని చెప్పిన ఆయన కవితలు ఇప్పుడు మనకు ఆదర్శంగా మారాయన్నారు.పుట్టుక నీది,చావు నీది బ్రతుకంతా దేశానిదని చెప్పిన గొప్ప మహనీయుడు కాళోజి గారు అని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ తెలిపారు.

## కాంగ్రెస్ కుంభకోణాలను బయటపెట్టడానికికే ఢిల్లీకి వెళ్లా

**కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు మొదలైంది**

**రైతుల సమస్య కూడా పరిష్కరించని సంస్కారం కాంగ్రెస్‌ది**

**9 నెలలుగా రైతులు ఆందోళన చేస్తున్నా సీఎంకు కలిసే తీరిక లేదా..?**

**తెలంగాణ భవన్ ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి కేటీఆర్**



**తొలి సమయం హైదరాబాద్, నవంబర్ 13 :** నేను ఢిల్లీకి వెళ్లింది అనుముల కుటుంబ కుంభకోణాలు బయటపెట్టేందుకు వెళ్లానని, మళ్లీ కూడా కుంభకోణాలను బయటపెడుతూనే ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు, పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్ అంశం, రాష్ట్రంలో భూసేకరణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న దురాగతాలపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ఢిల్లీకి వెళితే బీజేపీతో కాళ్ల బేరానికి వెళ్లినట్లా..? మరీ బీజేపీకే చెందిన గవర్నర్‌ను రేవంత్ రెడ్డి కలిస్తే అది కాళ్ల బేరానికి వెళ్లినట్లు కాదా..? అదానీ కాళ్లు పట్టుకొని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన మీద ఈడీ కేసు కాకుండా చూసుకున్నాడా..? లేదా..? చెప్పండి. నేను మలేషియా వెళ్లకుండానే వెళ్లినట్లు మీడియా వాళ్లు ఎలా రాస్తారు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ తుగ్లక్ ప్రభుత్వం నిర్ణయం కారణంగా అధికారులు బలి అవుతున్నారు. ప్రభుత్వం కుట్రలో అధికారులు బలి కావద్దని కోరుతున్నా. కొడంగల్‌లో రైతులతో భూసేకరణ పంచాయితీ వచ్చినప్పుడు పిలిచి మాట్లాడని కుసంస్కార ప్రభుత్వం ఇది. మా ప్రభుత్వంలో కూడా భూ సేకరణ సమస్యలు వస్తే రైతులను మెప్పించి ఒప్పించి, వాళ్ల కడుపులో తల పెట్టి మేము మంచి పరిహారం ఇచ్చాం. మల్లన్న సాగర్ వంటి ప్రాజెక్టును పూర్తి చేశాం. కానీ ఈ ముఖ్యమంత్రికి 9 నెలలుగా కొడంగల్‌లో ఆందోళన చేస్తున్న రైతులను కలిసే సమయం లేదని కేటీఆర్ మండిపడ్డారు.

# వికారాబాద్ ఘటనపై ప్రభుత్వం సీరియస్

**కుట్రలు చేసిన బిఆర్ఎస్‌ను వదిలేది లేదు**

**ఎవరున్నా కఠినంగా శిక్షించి తీరుతాం**

**దాడులతో రాష్ట్రాన్ని అప్రతిష్ట చేసే యత్నం**

**దాడిని కెసిఆర్ ఎందుకు ఖండించడం లేదు**

**దాడులు చేస్తే మిన్నకుంటామనుకుంటే మూర్ఖత్వమే**

**రాష్ట్రంలో పరిశ్రమలు రావడం బిఆర్ఎస్‌కు ఇష్టం లేదు**

**గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పరిశ్రమాలు రావాల్సిందే**

**వేర్వేరుగా ఘాటుగా హెచ్చరించిన భట్టి,కోమటిరెడ్డి, పొంగులేటి**



**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్**
వికారాబాద్ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా పలువురిని అరెస్ట్ చేయగా, పట్నంకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ క్రమంలో లగచర్ల గ్రామంలో జరిగిన ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసింది. బిఆర్ఎస్‌ను వదిలిపెట్టే ప్రసక్తి లేదని మంత్రులు హెచ్చరించారు. ఇప్పటికే ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు ఘాటు హెచ్చరికలు చేశారు. తాజాగా డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, పొంగులేటిలు ఘాటుగా స్పందించారు. వేర్వేరుగా మాట్లాడుతూ బిఆర్ఎస్ కుట్రలను ఛేదిస్తామని అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి చేయించింది బీఆర్ఎస్సేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. దాడులతో రాష్ట్రాన్ని ఏం చేద్దామనుకుంటున్నారని ప్రశ్నించారు. కలెక్టర్‌పై దాడిని బీఆర్ఎస్ ఎందుకు ఖండించలేదని, పదేండ్లుగా సీఎంగా పనిచేసిన కేసీఆర్ దీనిపై మాట్లాడరేంటని భట్టి నిలదీశారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావడం బీఆర్ఎస్‌కు ఇష్టం లేదని చెప్పారు. దాడి చేస్తే ఊరుకుంటామని అనుకుంటే మూర్ఖత్వమే అని అన్నారు. ఎవ్వరున్నా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించడం లేదని, అమాయకులైన ప్రజలను రెచ్చగొట్టి దాడి చేయించారని డిప్యూటీ సీఎం భట్టి ఆరోపించారు. భూమి కోల్పోతున్న రైతుల బాధ తమకు తెలుసని, భూమి కోల్పోయే వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తున్నామని భట్టి చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధితోనే రూరల్ ఏరియా అభివృద్ధి చెందుతుందని వివరించారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే భూసేకరణ కీలకమని ఆయన తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తే తప్ప ప్రపంచంతో పోటీ పడలేమని భట్టి స్పష్టం చేశారు. కొడంగల్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ప్లాన్ చేస్తున్నామని, రూరల్ ఏరియాకు అభివృద్ధిని విస్తరింపజేస్తామని ఆయన వివరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తాము ప్రజల పక్షాన పోరాడామని, తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ తరహాలో వ్యవహరించలేదని బీఆర్ఎస్ తీరుపై భట్టి మండిపడ్డారు. ఉద్యమంలో కూడా అమాయకులను రెచ్చగొట్టా రని, మీ కోసం అమాయక ప్రజలు బలి కావాలా అని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. దాడి ఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అధికారులపై దాడి చేయడం అమానుషమని, అధికారం కోల్పోవడంతో ఫ్రస్టేషన్ లో బీఆర్ఎస్ నేతలు ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తున్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దాడి చేసిన వారితో పాటు దాడికి ప్రోత్సహించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను, పాల్గొన్న వారిని విడిచిపెట్టమని.. అందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్, అధికారులపై దాడికి పాల్పడిన వారు కేటీఆర్‌తో ఫోన్‌లో టచ్‌లోనే ఉన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేయవచ్చని సూచించిన మంత్రి.. కలెక్టర్, అధికారులపై దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఇక ఫోన్ ట్యాపింగ్‌లో ఉన్నవాళ్లు జైలు ఊచలు లెక్క పెట్టాల్సిందే.. వారు ఎక్కడ దాక్కున్న రప్పించి జైలుకు పంపిస్తామని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ముగ్గురు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ పత్తి కొనుగోళ్లపై నెలకొన్న సందిగ్ధంపై నోరు మెదపడం లేదని.. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ కనీసం పత్తికి మద్దతు ధర గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. నోరు తెరిస్తే మూసీ ప్రక్షాళను అడ్డుకుంటామని మాట్లాడుతున్నారు తప్ప రైతుల గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి కొందరు రైస్ మిల్లర్ల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. రైతులను ఇబ్బందులు పెట్టేవారిపై చర్యలు తీసుకుంటామని.. రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరిక చేశారు. వారం రోజులల్లోగా మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే రైతులు వరి కోతలు ప్రారంభించారని.. రైస్ మిల్లర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వికారాబాద్ ఘటన వెనుక ఉన్నవారిని గుర్తించి.. ఆ నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్ ముసుగు వేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటన వెనక ఎవరున్నారో బయటపెడతామని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి హాజరైన మంత్రి.. భూములు, ఇళ్ల సమస్యలు, హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇళ్ల గురించి అధికంగా దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినట్లు మీడియాకు తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతీ పేదవారికి ఇళ్లు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించామన్నారు. 24 లక్షల ఇళ్లు పేదలకు ఇస్తామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చామని.. ఇచ్చిన మాట ప్రకారం ఇండ్లు ఇస్తామని చెప్పారు. మొదటి విడతలో స్థలం ఉన్నవారికి నిర్మాణం కోసం డబ్బులు ఇస్తామని ఆయన చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారుల ఎంపిక చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దేశంలోనే రోల్ మోడల్‌గా కొత్త ఆర్‌వోఆర్ చట్టం తీసుకు వస్తామన్నారు. రూ.2 లక్షలకుపైగా ఉన్న రైతుల రుణమాఫీ చేయాల్సి ఉందని, డిసెంబర్ 9వ తేదీ లోపు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# దేశంలో ఇక బుల్డోజర్ న్యాయం చెల్లదు

**- జడ్జిలా వ్యవహరించే అధికారం లేదు - ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుంది**

**- నిందితులు అయినంత మాత్రాన ఇళ్లు కూల్చేస్తారా - రాష్ట్రాల బుల్డోజర్ న్యాయంపై సుప్రీం ఆగ్రహం**

**- చర్యలు తీసుకునే అధికారులపై పెనాల్టీ - ఆక్రమణదారులకు తీర్పు వర్తించదు - సుప్రీం ధర్మాసనం కీలక తీర్పు...**



**న్యూఢిల్లీ,నవంబర్13:** బుల్డోజర్ల న్యాయంపై సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎగ్జిక్యూటివ్ అధికారులు న్యాయ పక్రియను తమ చేతుల్లోకి తీసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. నిందితులను దోషిగా చిత్రీకరించలేమని, దాని ఆధారంగా వాళ్ల ప్రాపర్టీలను నాశనం చేయడం సరికాదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. కేవలం నిందితులో లేక దోషులో అయినంతమాత్రానా, వాళ్ల ఇండ్లను కూల్చడం రాజ్యాంగవ్యతిరేకమే అవుతుందని సుప్రీంకోర్టు చెప్పింది. వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న వారి ఇండ్లను అక్రమంగా కూల్చుతున్నారని వేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు న్యాయవిచారణ చేపట్టింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసుల్లో తీర్పును ఇచ్చింది. నిందితుల ఇండ్లను కూల్చడం రాజ్యాంగ వ్యతిరేకం అని, అలాంటి చర్యలకు పాల్పడిన అధికారులపై పెనాల్టీ వేయాలని కోర్టు సూచించింది. నిందితులు, దోషులకు కొన్ని హక్కులు ఉంటాయని కోర్టు చెప్పింది. ఈ క్రమంలో బుల్డోజర్ల న్యాయంపై దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. రాత్రికి రాత్రే మహిళలు, చిన్నారులను వీధుల్లో చూడడం సంతోషకరమైన అంశం కాదు అని కోర్టు వెల్లడించింది. ఇండ్లను, అక్రమ ప్రాపర్టీలను ధ్వంసం చేసే పక్రియను వీడియో తీయాలని సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. ప్రజాభూమిలో అక్రమ నిర్మాణం చేపడితే తమ ఆదేశాలు ఆ కేసుల్లో అమల్లోకి రావు అని కోర్టు తెలిపింది. వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అధికారులు ఒక వ్యక్తి దోషి అని తేల్చి చెప్పలేరని, జడ్జిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులను కూల్చివేయడం తగదని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, ఆయా ప్రభుత్వాల అధికారులు మితిమీరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ధిక్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ధర్మాసనం హెచ్చరించింది. కూల్చివేత పక్రియలో నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే, ఆ ఆస్తి పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల జీతం నుంచి వసూలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది.

## ప్రజా సంక్షేమానికి ఎన్టీఏ కట్టుబడి ఉంది

**వైద్యశాలకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ**



**పాట్నా, నవంబర్ 13:** ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ బీహార్‌లోని దర్భంగాలో ఎయిమ్స్ వైద్యశాలకు శంకుస్థాపన చేశారు. సుమారు 12 వేల కోట్ల ఖరీదైన ప్రాజెక్టులను ఆయన ప్రారంభిం చారు. ప్రజల సంక్షేమానికి ఎన్డీఏ సర్కారు కట్టుబడి ఉన్నట్లు ఆయన చెప్పారు. దర్భంగా ఎయిమ్స్ వల్ల స్థానిక ప్రజల ఆరోగ్య విషయాల్లో పెను మార్పు రానున్నట్లు ఆయన వెల్లడించారు. పొరుగు దేశమైన నేపాల్ నుంచి కూడా వైద్య చికిత్సకు జనం రానున్నట్లు ఆయన తెలిపారు. బీహార్‌లో ఎంతో అభివృద్ధి జరుగుతోందని ప్రధాని అన్నారు. గత ప్రభుత్వాలు బీహార్ ప్రజలు ఆరోగ్యం గురించి ఆలోచించలేదని, ఆరోగ్య మౌళికసదుపాయాల్ని కల్పించలేకపోయినట్లు చెప్పారు. గతంలో ప్రభుత్వాలు తప్పుడు వాగ్దానాలు చేశాయని, కానీ నితీశ్ కుమార్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితి మెరుగైందన్నారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారి కోసం దేశవ్యాప్తంగా 1.5 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ తెలిపారు. తమ ప్రభుత్వం దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను కల్పించిందని, మరో 75వేల మెడికల్ సీట్లను సృష్టించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. నితీశ్ కుమార్ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, రాష్ట్రంలో ఉన్న జంగిల్ రాజ్‌ను తొలగించినట్లు ఆయన తెలిపారు. వరద సమస్యలను దూరం చేసేందుకు బీహార్‌లో ఎన్డీఏ సర్కారు సుమారు 11 వేల కోట్ల ప్రాజెక్టులను అమలు చేస్తోందన్నారు.

## జార్ఖండ్‌లో తొలిదశ ఎన్నికలు పూర్తి

**తొలి సమయం రాంచీ,నవంబర్13:** జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తొలిదశ పోలింగ్ ప్రశాంతంగా సాగింతోంది. మధ్యాహ్నం 3 గంటల సమయానికి 59.28 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఇసి సమాచారం ప్రకారం.. సరాయికేలా-ఖర్సావాలో అత్యధికంగా 66.38 శాతం పోలింగ్‌తో ముందంజలో ఉండగా, లోహర్‌దాగా, సిమ్‌దేగా నియోజకవర్గాలు వరుసగా 65.99శాతం, 64.31శాతాలలో రెండవ స్థానంలో కొనసాగుతున్నాయి. రాంచీలో అత్యల్పంగా 53శాతం ఓటింగ్ నమోదైనట్లు ఇసి పేర్కొంది. ÷రిలిదశలో ప్రముఖ క్రికెట్ ప్లేయర్ ఎం.ఎస్.ధోనీ రాంచీలో తన ఓటు హక్కుని వినియోగించుకున్నారు. పోలింగ్ కొనసాగుతోందని, డ్రోన్లతో భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జార్ఖండ్‌లో తొలిదశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 46.25 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల కమిషన్ (ఇసి) ప్రకటించింది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆయన భార్య కల్పనా సోరెన్‌లు రాంచీలో తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు జార్ఖండ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని హేమంత్ సోరెన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.గుమ్లా నియోజకవర్గం 52.11 శాతం పోలింగ్‌తో ముందంజలో కొనసాగుతుండగా, లోహర్‌దాగా, ఖుంటిలు వరుసగా 51.53 శాతం, 51.37 శాతం పోలింగ్‌తో రెండవ స్థానంలో కొనసాగుతున్నట్లు ఇసి తెలిపింది. రాష్ట్ర రాజధాని రాంచీలో మధ్యాహ్నం సమయానికి అత్యల్పంగా 40.98శాతం పోలింగ్ మాత్రమే నమోదైందని పేర్కొంది. జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ సీట్లలో 43 స్థానాలకు నేడు తొలిదశలో ఓటింగ్ కొనసాగుతోంది. మరో 38 స్థానాలకు నవంబర్ 20న రెండవ దశలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్‌కు అనుమతించారు. కొన్ని బూత్‌ల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగనుంది. భద్రత కోసం 200కుపైగా కంపెనీల భద్రత దళాలను మోహరించారు. బుధవారం దేశవ్యాప్తంగా మరో 31 అసెంబ్లీ స్థానాలు, కేరళలో వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో తొమ్మిది, రాజస్థాన్‌లో ఏడు, పశ్చిమ బెంగాల్‌లో ఆరు, అస్సాంలో ఐదు, బీహార్, పంజాబ్‌ల్లో నాలుగేసి స్థానాలు, కర్ణాటకలో మూడు, కేరళ, మధ్యప్రదేశ్‌ల్లో రెండేసి స్థానాలకు, ఛత్తీస్‌గఢ్, గుజరాజ్, మేఘాలయలో ఒకొక్క స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు.

# చిల్లర కొనుగోలు అరికట్టాలి

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రగతిశీల అఖిల భారత రైతు సంఘం (ఏఐపికేఎస్ )**

**తొలి సమయం మహబూబాబాద్ నవంబర్ 13**
జిల్లా కేంద్రం,పట్టణం చుట్టూ రైతు పండించిన పంటలను కొనుగోలు చేస్తున్న చిల్లర కాంటాలను నియంత్రించాలని సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ (ప్రజా పందా),ప్రగతిశీల అఖిలభారత రైతు సంఘాల(ఏఐపీకేఎస్)ఆధ్వర్యంలో మహబూబాబాద్ మార్కెట్ సెక్రటరీ షమీంకు ఒక వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ ఎంల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ ఎంతో శ్రమతో ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులు, మార్కెట్ లో తమ పంటను స్వేచ్చగా, సంతృప్తిగా అమ్ముకోకుండా పట్టణం చుట్టుపక్కల పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ కొనుగోలు దారులు రైతులను గందరగోర పరుస్తున్నారని ఆరోపించారు..అడ్డగోలు కొనుగోలు చేపడుతున్నారని ఆరోపించారు. పత్తి మిర్చి వరి అపరాలు తదితర పంటలను పండిస్తున్న రైతులకు ప్రభుత్వ రంగ సంస్థలచే కొనుగోలు చేపట్టి రైతుకు తగి న్యాయం చేయాలని ఆయన కోరారు. లక్ష రూపాయల పెట్టుబడులతో అష్ట కష్టాలకోర్చి పంటలు పండించిన రైతులకు రేట్లు, తూకాలు పేరుతో పెద్ద ఎత్తున తీవ్రంగా నష్టపరుస్తున్నారని ఆరోపించారు. వారిని నియంత్రించాల్సిన మార్కెట్ రెవెన్యూ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ) కొనుగోలు పెద్ద ఎత్తున చేపట్టి తేమ నిబంధనను ఎత్తివేయాలని మార్క్ఫెడ్ సంస్థచే మొక్కజొన్నలు కొనుగోలను



ప్రభుత్వమే చేపట్టాలని ఆయన అన్నారు.లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించక తప్పదని రవి హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఫైండ్ల యాకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండపల్లి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా నాయకులు ఈక బిక్షం,మండల నాయకులు పులుస నాగేశ్వరరావు,వీరస్వామి,సమ్మయ్య,సారయ్య,సురేష్,బుచ్చి రాములు, సత్యం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### స్పందించిన మార్కెట్...

కార్యదర్శి చిల్లర కంటాలతో రైతులకు మోసం జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, వీలైనంత తొందరలో వాటిని అరికట్టే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

# తెలంగాణ గణితఫోరమ్ (టీఎంఫ్) జిల్లా శాఖ ఎన్నిక

**తొలి సమయం ఎడ్యుకేషన్ నవంబర్ 13:**
తెలంగాణ గణితఫోరమ్ (టీఎంఫ్ ) జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు శ్రీ మచ్చ సోమయ్య అధ్యక్షతన నిర్వహించారు , ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టిఎంఎఫ్ రాష్ట్ర ట్రెజరర్ గా అడికె సతీష్ పాల్గొన్నారు.అయన మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయులు విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని తొలగించాలి అన్నారు అభ్యసన కృత్యాలను నిర్వహించి, గణితం పట్ల అభిరుచిని పెంపొందించాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కమిటీని రద్దుచేసి నూతన జిల్లా కమిటీని ఎన్నుకోనైనది

**నూతన జిల్లా శాఖ వివరాలు**
గౌరవ అధ్యక్షులు మచ్చ సోమయ్య, అధ్యక్షులుగా



తాడూరు మాధవాచారి,ప్రధాన కార్యదర్శి దుబ్బాక శ్రీధర్ రెడ్డి,కోశాధికారి రామ సహాయం శ్రీధర్ రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మిరియాల సతీష్ రెడ్డి,కాసం శ్రీనివాసరావు,విలిదె సురేష్ ఉపాధ్యక్షులు మద్ది లింగమూర్తి,చీకటి ఉపేందర్,సునీత టాలెంట్ టెస్ట్ కన్వీనర్స్ గా జూలూరు పురుషోత్తం,దత్త ప్రసాద్,ఇందిరాఅకాడమీ కో ఆర్డినేటర్సగా.ముదిగిరి సదయ్య, దుర్గాప్రసాద్,ఇ శ్రీవాణి నూతన కమిటీ ఏనుకోవడం జరిగింది.ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మరియు తెలంగాణ గణిత ఫోరం బాధ్యులు పాల్గొన్నారు

# కుల గణనను వ్యతిరేకించే వారు ప్రజా ద్రోహులే

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్**

**తొలి సమయం భూపాలపల్లి నవంబర్ 13:**
ఎవరైతే కుల గణనను వ్యతిరేకిస్తారో వారు ప్రజా ద్రోహులేనని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి కుల సర్వే శాస్త్రీయతను కల్పిస్తుందన్నారు. బీఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులు కుల గణన ఎందుకని అడుగుతున్నారని మండిప డ్డారు. కానీ అధికారం ఏ కులం గుప్పిట్లో ఉంది. బడ్జెట్ కేటా



యింపులు ఏ కులానికి ఎక్కువగా అందుతు న్నాయి. ఏ సామాజిక వర్గాలు ఎంత అభివృద్ధికి నోచుకున్నారు. ఏ స్థాయిలో ఎవరు ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు. విద్యా, ఉద్యోగాల్లో ఏ వర్గం ముందంజలో ఉంది అనే విషయాలు తెలుస్తాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ సమగ్ర కుల సర్వే చేసి ఆ రిపోర్టు ఆధారంగా తమకు అనుకూలమైన వారికే మేలు చేశారని ఆరోపించారు.

## జమ్ముకశ్మీర్ పెరుగుతున్న
# ఉగ్ర కార్యకలాపాలు

**స్థానికుల నుంచి సహకారం అందుతుందని సైనికుల అంచనా**

**భద్రత కట్టుదిట్టం చేసిన అధికారులు**

**జమ్ముకశ్మీర్, నవంబర్ 13 :** జమ్మూ కశ్మీర్‌లో విదేశీ ఉగ్రవాదులు పెద్ద ఎత్తున కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఉగ్రవాదుల కార్యకలాపాలతో పాటు రిక్రూట్‌మెంట్‌లు నిర్వహించే పద్ధతుల్లో సైతం మార్పులు కనిపిస్తున్నది. సరిహద్దుల్లోకి చొరబడడం మాని అంతర్గత ప్రాంతాల్లో దాక్కొని దాడులకు తెగబడుతున్నారు. ఉగ్రవాదులకు స్థానికంగా తక్కువ మంది మాత్రమే సహకారం అందిస్తున్నట్లుగా సైన్యం వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో 119 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో 79 మంది పీర్ పంజాల్‌లో ఉన్నారు. 18 మంది స్థానికులు, 61 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు ఉన్నట్లు అంచనా. పీర్ పంజాల్‌కు దక్షిణాన 40 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారు. ఇందులో 34 మంది పాకిస్థానీలు కాగా.. ఆరుగురు స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. సమాచారం మేరకు.. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు 25 ఉగ్రవాద ఘటనలు రికార్డయ్యాయి. ఈ ఘటనల్లో 24 మంది జవాన్లు అమరులయ్యారు. గతేడాది ఈ సంఖ్య 27గా ఉన్నది.ఈ ఏడాది 61 మంది ఉగ్రవాదులు హతమవగా.. ఇందులో ఇంటీరియర్‌లో 45 మంది.. నియంత్రణ రేఖ వద్ద 16 మంది మరణించారు. ఇందులో 21 మంది పాక్ ఉగ్రవాదులు ఉన్నారు. ఇక నార్తర్న్ కమాండ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఎంవీ సుచీంద్ర కుమార్ వైట్ నైట్ కార్ప్స్‌ని సందర్శించారు. సైనిక సన్నద్ధతపై సమీక్షించారు. అప్రమత్తంగా ఉంటూ ఉగ్రవాదుల కోసం ఆపరేషన్ ముమ్మరం చేయాలని భద్రతా బలగాలను ఆదేశించారు.

## వజ్ర టీవీ షోరూం. ఓపెనింగ్ చేసిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

**పట్టణ గ్రామీణ ప్రజలకు అందుబాటులో**

**టీవీఎస్ వాహనాలు రావడం అభినందనీయం...**



**తొలి సమయం ఇల్లందు నవంబర్ 13:**
ఇల్లందు పట్టణంలో ఇప్పటికే పలు వాహనాల షోరూంలు నడుస్తున్నాయి అని వాటితో పాటు వజ్ర టీవీఎస్ షోరూం పట్టణ వాసులతో పాటు గ్రామీణ ప్రజలకు చిన్న వాహనాలతో అందుబాటులోకి రావడం అభినందనీయమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. టీవీఎస్ షోరూం వాహనాల కొనుగోలు చేసే వాహనదారులకు శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ సంపూర్ణ సహకారం అందిస్తుందని ఫైనాన్స్ నిర్వాహకులు తెలిపారు. ఇల్లందు పట్టణ మండల ప్రజలకు అందుబాటులో టీవీఎస్ వాహనాలను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు టీవీఎస్ వజ్ర యాజమాన్యం లకావత్ వినోద్. లకావత్ రమేష్ తెలిపారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**తొలి సమయం మహబూబాబాద్ 13:**



జడ్పీహెచ్ఎస్ కంబాలపల్లి పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంచార్జి ప్రధానోపాధ్యాయులుసోమ .విష్ణు వర్ధన్ బాబు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలను బోధించారు అన్నారు ఉపాధ్యాయ వృత్తి అనేది ఎంత ఉత్తమమై నదో పిల్లలకు తెలిసిందని అన్నారు. ఈ కార్యక్ర మంలో డిఇఓగా సోహెల్ ,ప్రధానోపాధ్యా యులుగా ఇ. ధనుంజయ్, ఉపాధ్యాయులుగా శివ, అభిషేక్, విఘ్నేష్, కాజల్,అంజలి, పిఇటీగా ముఖేష్ వ్యవహ రించారు. పిల్లలందరూ ఉపాధ్యాయులుగా వ్యవహ రించినప్పుడు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ వృత్తి ఎంత గొప్పదో వారికి తెలిసిందని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు రామ సహాయం శ్రీధర్ రెడ్డి,జి ఉప్పలయ్య, కాసం శ్రీనువాస్ రావు,వి. తిరుపతి అల్లి సతీష్ కుమార్, శిభారాణి, ఓర్ఘూన్సీ,మల్లారెడ్డిఏం.వెంకటేశ్వర్లు, జడ్జిలుగా వీరభద్రం, యుంగేందర్, కవితలు పాల్గొన్నారు.

## ఆకుతోట కుమారస్వామి
# సంచలన వ్యాఖ్యలు

**తొలి సమయం భూపాలపల్లి నవంబర్ 13 :**



లగచర్ల దాడి కేసులో కేటీఆర్ ప్రధాన సూత్రధారని కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశానికి ఖలిస్తాన్ తీవ్రవాదులు ఎంత ప్రమాదమో..తెలంగాణకు కేసీఆర్ కుటుంబం అంత ప్రమాదంమంటూ, కాశ్మీర్ తీవ్రవాదులు ఎంత డేంజరో..బీఆర్ఎస్ కూడా అంతే డేంజర్ అని ఆయన తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం పతనం ఖాయ మంటూ ఆకుతోట కుమారస్వామి జోష్యం చెప్పారు.

# ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వారికే కేటాయించాలి

**అన్ని విభాగాలలో ఆర్ ఓ ఆర్ పాటిస్తూ ఉద్యోగుల పదోన్నతులు, నియామకాలు చేపట్టాలి**

**ఎస్సీ ఎస్టీ కేసుల పరిష్కారంలో సత్వర చర్యలు చేపట్టాలి**

**రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**





**తొలి సమయం కలెక్టరేట్ మహబూబాబాద్ నవంబర్ 13:** ఎస్సీ ఎస్టీ కేసుల పరిష్కారంలో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, 15 రోజుల్లో పరిష్కరించి వాటి నివేదిక అందజేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో భూ, అట్రాసిటీ సమస్యలపై రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, సాంఘిక సంక్షేమ శాఖ, డిఆర్డిఓ జడ్పీ సీఈవో, ట్రైబల్ వెల్ఫేర్, సంక్షేమ గృహాల శాఖల మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ, అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అంతకు ముందు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా కవి కాళోజి నారాయణరావు వర్ధంతి సందర్భంగా కాళోజి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, చిత్రపటాలకు పూలను జల్లి అంజలి ఘటించారు. ఈ సమావేశానికి వచ్చిన రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, మొక్కను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి పురోగతి వివరాలను. జిల్లా ఎస్పీ, కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన పలు భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల గురించిన వివరాలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు చైర్మన్ ను కోరారు. ఈ సందర్భంగా భూ వివాదాలకు సంబంధించిన కేసులు, అట్రాసిటీ కేసుల పరిష్కారం ఎన్ని రోజుల్లో జరుగుతుందని తొర్రూరు మహబూబాబాద్, ఆర్డీవోలు, గణేష్ కృష్ణవేణి,పోలీస్ అధికారులను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో ఎంతమంది బాధితులకు పరిహారం అందిందని వివరాలను జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి నర్మదను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ కేసుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు.. జిల్లాలో దళితుల భూమి సమస్యకు సంబంధించి వారం రోజుల్లో నివేదిక ను తమకు అందజేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే తప్పకుండా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కు సూచించారు. గ్రామాలలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కు అన్ని కులాలు హాజరయ్యేలా అధికారులు చూడాలన్నారు. సివిల్ రైట్స్ డే నిర్వహణ కు సంబంధించి సంవత్సర కాలానికి తహసీల్దార్, ఎస్సై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సివిల్ రైట్స్ డే అవగాహన కార్యక్రమాల్లో భాగంగా భూ సమస్యలు, మూఢనమ్మకాలు, తదితర సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల బాధితులకు పరిహారం అందే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. భూముల సమస్యలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని ఎస్సీ ఎస్టీలకు న్యాయం చేయాలన్నారు. బాధిత ఎస్సీ ఎస్టీలకు కమిషన్ అండగా నిలుస్తుందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం అందరికీ అండగా ఉంటుందన్నారు. అదేవిధంగా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఎస్సీ ఎస్టీ స్టడీ సర్కిల్స్ లో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. మెస్ చార్జీలు పెంచినందుకు ముఖ్యమంత్రికు ధన్యవాదాలు. ఎస్సీ ఎస్టీ కేసులు పెండింగ్ లో ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ రాజ్యాంగబద్ధ కమీషన్ అని పేర్కొన్నారు. వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్లకు వచ్చే ఎస్సీ ఎస్టీల సమస్యలను పోలీసులు ఓపికగా వినాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వము, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్నేహపూర్వక పోలీసింగ్ ను అమలు చేస్తున్నారని అన్నారు. అట్రాసిటీ కేసులు పెండింగ్లో ఉండకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలతోనే ఎస్సి, ఎస్టి లకు సంబంధించిన భూవివాద సమస్యలు, అట్రాసిటీ కేసులకు పరిష్కారం లభిస్తుందని, జిల్లాలోని యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా చదువుపై ఆసక్తి కలిగేందుకు అవగాహన కల్పించాలని, జిల్లాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని, ఎస్సీ ఎస్టీల భూములను కబ్జాలు కాకుండా పరిరక్షించాలని, పరిశ్రమల శాఖ పెండింగ్లో ఉన్న పథకాల అమలు పెండింగ్ ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి గారు 1000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, అందుకు సంబంధించిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్,ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ ప్రాథమిక నివేదికలు అందాయని, వాటిపై 15 రోజులలో సమగ్ర నివేదికను కమిషన్ కు అందజేస్తామన్నారు , జిల్లాస్థాయిలో వసతి గృహాల నిర్వహణ, విద్యా, వైద్యం అన్ని విభాగాలకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు , ఎస్సీ,ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం సూచనల మేరకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డిఓ గణేష్, కృష్ణవేణి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు నునావత్ రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, గుండాల నరసయ్య, కే.సంజీవరావు, పి సుధాకర్, గుగులోతు కిషన్ నాయక్, పి.అశోక్ కుమార్, అడిషనల్ ఎస్పీ చేన్నయ్య, జెడ్పి సీఓ పురుషోత్తం, డిఆర్డిఓ మధుసుదన్ రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డిహెచ్ఓ మరియన్న, సిపిఓ సుబ్బారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహస్వామి, డిపిఓ హరిప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బుల్డోజర్ ఇప్పుడు గ్యారేజ్‌లో ఉంటుంది

**సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్**

**లక్నో, నవంబర్ 13 :** బుల్డోజర్ ఇప్పుడు గ్యారేజ్‌లో ఉంటుందని ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. 'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీంకోర్టు తీర్పును ఆయన స్వాగతించారు. ఇకపై పేదల ఇళ్లను కూల్చివేయలేరంటూ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై మండిపడ్డారు. నవంబర్ 20న ఉప ఎన్నికలు జరగనున్న కాన్పూర్‌లోని సిసామావు అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. 'సుప్రీంకోర్టు ఏం చెప్పిందో మీకు తెలిసి ఉండాలి. ఈ ప్రభుత్వానికి ప్రతీకగా మారిన బుల్డోజర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యానించింది. ఈ తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు' అని అన్నారు. కాగా, ఇళ్లు కూలగొట్టే వారి నుంచి ఏమి ఆశించాలి? అని అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. 'ఇప్పుడు వారి బుల్డోజర్ గ్యారేజ్‌లో ఉంటుంది. పేదల ఇల్లు ధ్వంసం చేయలేరు' అని అన్నారు. సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్న కవి ప్రదీప్ పంక్తులను కూడా అఖిలేష్ యాదవ్ ప్రస్తావించారు. 'ప్రతి ఒక్కరూ ఇంటి కోసం కలలు కంటారు. ఆ ఇంటి కల నెరవేర్చుకోవాలని ప్రతి వ్యక్తి కోరుకుంటాడు' అని అన్నారు. సీఎం యోగి ప్రభుత్వంపై ఇంతకంటే బలమైన విమర్శలు ఉండబోవని మండిపడ్డారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో

# రైతుల అరిగోస

- 25 రోజులుగా కుప్పలు పోసిన ధాన్యం, పట్టించుకునే నాథుడు లేడు
- కుప్పలు చెయ్యడం వలన బొబ్బలు
- కొనుగోలు కేంద్రాలు ఇలానే కొనసాగితే ధర్నాలు రాస్తారోకోలు చేస్తాం



**తొలి సమయం వరంగల్ నవంబర్ 13:** ప్రభుత్వ ధాన్యం కొలుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యాన్ని కొనడంలో తీవ్రమైన నిర్లక్ష్యం వహించడం మూలంగా రైతులు అరిగోస పడుతున్నారని. సిపిఐ అనుబంధ భారత జాతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పానకల్లు మండలం కేతేపల్లి రైతు వేదిక వద్ద రైతులు ధాన్యాన్ని కుప్పలుగా పోసి 25 రోజులు అవుతుందని. కానీ పలకరించే నాథుడే లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ధాన్యం ఆరబోసేందుకు కిరాయికి పట్టాలు తెచ్చుకుంటున్నారని 25 రోజుల నుండి పట్టలకు రైతు అద్దె కట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు, రోడ్లపై వడ్లను ఆరపోయడం.. వర్షపు చినుకులకు వడ్లు తడవడం.. మళ్లీ వాటిని కుప్పలుగా చేయడం వలన రైతుల చేతులకు బొబ్బలు ఎక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు..రైతులు దాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారని కంటికి కునుకు లేకుండా రైతులు ఆందోళనకు గురి అవుతున్నారని అన్నారు. ప్రైవేటు వ్యాపారులు ప్రవేశం చేస్తున్నారని, శ్రీరంగాపురం వనపర్తి ప్రాంతాల నుండి బాయిల్డ్ రైస్ మిల్లర్లు కొనుగోలుకు వచ్చారని, గత్యంతరం లేని పరిస్థితుల్లో తక్కువ ధర కైనా పరవాలేదు అమ్మేసుకుంటామని రైతులు నిరాశ చెందుతున్నారని అన్నారు. వర్షానికి తడవకుండా టార్పెట్లు ఇస్తామన్న అధికారుల జాడ పత్తా లేదని అన్నారు కొనుగోలు కేంద్రాల వద్ద నీడ లేక రైతులు ఎండకుమాడుతున్నారని.. కనీసం మంచినీటి వసతి కూడా కల్పించలేదని ఆవేదన పడ్డారు.. ఇదే రకంగా కొనుగోలు కేంద్రాలు నిర్లక్ష్యంతో కొనసాగితే ధాన్యం కేంద్రాల వద్ద ధర్నాలతో పాటు రాస్తారోకోలు చేస్తామని నిప్పులు చెరిగారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డెంగు కురుమయ్య మాజీ గ్రామ కార్యదర్శి అంజి, సీనియర్ నాయకులు కాకము చిన్న నారాయణ కురువ హనుమంతు, చిన్న కురుమయ్య, ఇల గుడ్డు రాముడు, నరసింహ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొల్‌కతాలో భారీ అగ్ని ప్రమాదం

**కోల్‌కతా, నవంబర్ 13 :** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని సంధ్యా బజార్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ ఫైటర్స్ ఫైరింజన్‌ల సాయంతో మంటలను అర్పుతున్నారు. మంటలను ఆర్పేందుకు మొత్తం ఆరు ఫైరింజన్‌లను వినియోగిస్తున్నారు. సంధ్యాబజార్‌లో వరుసగా దుకాణ సముదాయాలు ఉంటాయని, ఒక దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా పక్కనున్న దుకాణాలకు విస్తరించాయని స్థానిక అధికారులు తెలిపారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమై ఉంటుందని చెప్పారు. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

# గురివింద సామెత చందంగా కెటిఆర్ వ్యవహారం !



**తొలి సమయం హైదరాబాద్,**

తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా ..అని వేమన ఏనాడో చెప్పాడు. ఇది అచ్చంగా బిఆర్ఎస్ నేతలకు వర్తిస్తుంది. మరీ ముఖ్యంగా కెటిఆర్, హరీష్ రావులకు అచ్చుగుద్దినట్లుగా ఉంటుంది. మొగుణ్ణి కొట్టి మొగుసాలకు ఎక్కిందన్నది సామెత. చేసిన తప్పులన్నీ చేసి..ఇప్పుడు కాంగ్రెస్ మీదపడి ఏడుస్తున్నారు. పదేళ్ల పాపాల గురించి మాట్లాడరు. తమ పాలనలో అవినీతి వ్యవహారాల గురించి సమాధానం చెప్పరు. తమ పాలనలో మల్లన్నసాగర్ రైతులు తిరగబడితే ఎందుకు కేసులు పెట్టారో చెప్పరు. ఖమ్మం జిల్లాలో రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో..ఎందుకు బేడీలు వేశారో చెప్పరు. కాళేశ్వరం అవినీతిపైనా మాట్లాడరు. వికారబాద్ జిల్లాలో రైతులను రెచ్చగొట్టిన ఘటనకు సమాధానం చెప్పాలి. నిజానికి ఫార్మా కంపెనీల సృష్ట ప్రదాత కెటిఆర్. దానిని ఎవరూ కాదనలేరు. రైతుల భూములను అడ్డంగా లాక్కుని వ్యాపారం చేయడం ఎవరు చేసినా నిలదీయాల్సిందే. కానీ బిఆర్ఎస్ కాదు. అది ప్రజలకు వదిలేయాలి. అవినీతి నేతలు నీతులు వల్లించడం సరికాదు. ఎందుకంటే బిఆర్ఎస్ గురించి చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా అవినీతి కథలు ఉన్నాయి. కానీ ఎదురుదాడి చేయడం, గగ్గోలు పెట్టడం ద్వారా పదినెలల ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్నారు. నిజంగానే అవినీతి జరిగితే బయటకు లాగుదాం. కానీ పదేళ్ల అవినీతి గురించి చర్చించకుండా..కేవలం పది నెల్లలోనే అవినీతి జరిగిందని చెప్పడం గురివింద సామెతను గుర్తు చేస్తోంది. ముందుగా పదేళ్ల అవినీతిపై ఊరూవాడా చర్చిద్దాం. ఎవరెవరి భూములు పోయాయో, ధరణితో ఎంతమందిని మోసం చేశారో చర్చిద్దాం. అవినీతిపై చర్చలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరున్నా వదిలిపెట్టకుండా రచ్చబండ ఏర్పాటు చేస్తే మంచిది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ తర్వాత పార్టీలోని కొందరు కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలతో సహజంగానే పార్టీలో కొంత నీరసం ఆవహించింది. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెల్చుకోక పోవడం కూడా గులాబీ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ పడింది. ఆ తర్వాత కొద్ది పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు పార్టీ మారడంతో కారు పార్టీలో నిస్తేజం నిండింది. మరోవైపు ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ రాజకీయ మౌనం పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ప్రతిపక్ష నేతగా చురుకుగా ఉండాల్సిన కెసిఆర్ ఇంటికే పరిమితం కావడం దారుణం కాక మరోటి కాదు. అధికారం లేకుంటే అసెంబ్లీలో అడుగు పెట్టమన్న రీతిలో కెసిఆర్, జగన్ తీరు ఉంది. ఈ క్రమంలో తమపై అవినీతి కేసుల దాడి పెరగడంతో ఆత్మరక్షణ కోసం బిఆర్ఎస్ విన్యాసాలు చేస్తోంది. ఎదురుదాడిని ఎంచుకుంది. ఇవన్నీ ప్రజలు నమ్ముతారని అనుకుంటే అవివేకం తప్ప మరోటి కాదు. ఇవన్నీ ఎక్కడ మెడకు చుట్టుకుంటాయో అన్న భయంతోనే కెటిఆర్ గత కొద్ది రోజులుగా దూకుడుగా వ్యవహరి స్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఇద్దరూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. అంశాలవారీగా కాంగ్రెస్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక విషయంలో న్యాయస్థానంలో సవాల్ విసిరారు. గతంలో ఎమ్మెల్యేలను మరి గొర్రెల్లాగానే కొనుగోలు చేశారా అన్నది చెప్పాలి. నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వరదలు, రైతుల రుణ మాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన,ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే అరికలపూడి గాంధీ సవాళ్ల వంటి అంశాలపై గగ్గోలు చేస్తున్నారు. ఇంత ప్రజాస్వామ్యయుతంగా మాట్లాడుతున్నారంటే అది రేవంత్ రెడ్డి సర్కార్ కల్పించిన స్వేచ్ఛ అని చెప్పక తప్పదు. గతంలో జర్నలిస్టులను మాట్లాడనీయలేదు. సోషల్ మీడియా వారిపైనా కేసులు పెట్టారు. వేధింపులు చేశారు. సిఎంను కలవకుండా చేశారు. మంత్రుల దగ్గరకు రాకుండా కట్టడి చేశారు. ఇన్ని మాట్లాడుతున్న కెటిఆర్ తన హయాంలో జరిగిన అవినతి కేసుల గురించి ముందుగా సమాధానం చెప్పాలి. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో విదేశీ కంపెనీకి అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.55 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని, ఈ కేసులో ఏసీబీ విచారణ చేస్తోంది. ఈ క్రమంలో కెటిఆర్‌ను ఎసిబి అరెస్టు చేస్తోందని కాంగ్రెస్ మంత్రులు గత కొద్ది రోజులుగా చెబుతున్నారు. అరెస్టుపై గవర్నర్ అనుమతి తీసుకున్నారని త్వరలోనే కేటీఆర్ అరెస్టు అవడం ఖాయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మంత్రి కేటీఆర్ ఢిల్లీ యాత్ర అందరినీ ఆకర్షించింది. అరెస్టు నుండి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వ సాయం కోసమే ఢిల్లీ వెళ్లారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన చేశారు. గతంలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితకు బెయిల్ ఎలా వచ్చిందో కూడా తమ వద్ద ఆధారాలున్నాయని చెప్పడం గమనార్హం. ఇలా తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో కేటీఆర్ ఢిల్లీలో కాలుపెట్టడం మరింత సంచలనానికి దారి తీసింది. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయకారి ఒప్పందం ఉందని అందరికీ తెలిసిదే. బీజేపీ నేతలతో మంతనాలు జరిపేందుకేనా అన్న ఊహాగానాలు చెలరేగాయి. ఈ క్రమంలో తెలంగాణలో తనపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా మంత్రి కేటీఆర్ అమృత్ టెండర్ల వ్యవహారన్ని తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అమృత్ పథకంలో స్కాంకు తెరలేపారని ఆరోపించారు. అమృత్ పథకంలో పనులకు గాను 8888 కోట్ల టెండర్లను పిలిచిన రేవంత్ రెడ్డి తన బావమరిది సృజన్ రెడ్డి కంపెనీ కట్టబెట్టారని కేంద్ర పురపాలక శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయనకు అందజేశారు. పార్లమెంట్ సమావేశాల్లోగా రేవంత్ సర్కార్ పై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. అంతే కాకుండా రెవెన్యూ మంత్రి పొంగులేటికి సంబంధించిన స్కాంలను బయటపెడతానని హెచ్చరించారు. తప్పులేదు. రేవంత్, పొంగులేటిలు తప్పు చేసివుంటే కోర్టుకీడ్చాల్సిందే. అందుకే అందిరి అవినీతిపైనా చర్చ జరగాలి. విచారణ జరగాలి. కేసులు వేయాలి. అందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు మాత్రమే పరిష్కారం చేయగలవు.

## మరోమారు మోడీ విదేశీ పర్యటన

**17 ఏళ్ల తరవాత తొలిసారిగా నైజీరియాకు ప్రధాని**

**16 నుంచి 21 వరకు వివిధ దేశాల్లో మోడీ పర్యటనలు**

**న్యూఢిల్లీ,నవంబర్13:** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు ఖండాల్లో మూడు దేశాలు పర్యటించనున్నారు. నవంబర్ 16 నుంచి 21 వరకు ఆయన ఆఫ్రికా ఖండంలోని నైజీరియాతో పాటు దక్షిణ అమెరికా ఖండంలోని బ్రెజిల్, గయానా దేశాలను సందర్శించనున్నారు. గ్లోబల్ సౌత్ నినాదంతో ప్రపంచం లోని దక్షిణ దిక్కున ఉన్న దేశాల గళాన్ని బలంగా వినిపిస్తున్న ప్రధాని మోదీకి ఈ మూడు దేశాల పర్యటన వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారింది. ఆయా దేశాలతోనే కాదు, ఆ ఖండాలతోనే సంబంధాలను మరింత మెరుగుపరుచుకోవడంలో ఈ పర్యటన కీలకంగా మారనుంది. ప్రధాని నరేంద్ర మోదీ రెండు ఖండాల పర్యటన వివిధ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచ వేదికపై భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాలతో పాటు కరేబియన్ దీవుల్లో దేశాలతో భారత బంధం మరింత దృఢోపేతం కానుంది.ప్రధాని మోదీ నైజీరియా పర్యటన విశేషాలను గమనిస్తే.. 17 ఏళ్ల తర్వాత భారత ప్రధాని తొలిసారిగా నైజీరియాలో పర్యటిస్తున్నారు. ఆ దేశ అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధాని మోదీ, నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు మధ్య వివిధ అంశాలపై చర్చలు జరుగుతాయి. ఇవి రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించడం, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో దోహదపడతాయి. భారత్, నైజీరియా దేశాలు 2007 నుంచి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇందులో భాగంగా ఆర్థిక, ఇంధన, రక్షణ రంగాల్లో సహకారం అందించే ఒప్పందాలు కూడా ఉన్నాయి. దాదాపు 200 భారతీయ కంపెనీలు నైజీరియాలో ఇప్పటికే 27 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టాయి. ప్రధాని మోదీ ఇక్కడ భారతీయ సమాజాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ పర్యటన రెండు దేశాల మధ్య సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. నవంబర్ 18, 19 తేదీల్లో బ్రెజిల్‌లోని రియోడిజనీరో నగరంలో జరగనున్న జి20 సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారు.

# సామాన్యులకు ధారాఘాతం

### - ధరల దాడిపై కిమ్మనని పాలకులు - ఎన్నికల వేళ పట్టింపులేని నేతలు

**న్యూఢిల్లీ:** అడ్డూ అదుపు లేకుండా పెరుగుతన్న నిత్యావసరాల ధరలు సామాన్య,మధ్య తరగతి ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. బియ్యం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఉప్పు, పప్పు, నూనె, పెట్రోల్.. ఇలా అన్నింటి ధరలు అందనంతగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు మందుల ధరలు కూడా సైలెంట్‌గా పెంచేశారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు దాడి చేస్తున్నాయి. పెట్రో ధరలతో అన్నిరకాల వస్తువుల ధరలు దాదాపు రెండింతలు అయ్యాయి. చాయ్ సింగిల్ కనీసం 15 రూపాయలుగా అమ్ముతు న్నారు. మూడేళ్లలో నెలసరి ఇంటి ఖర్చులు ఏకంగా 5 వేలు దాటేశాయి. ఈ ధరాఘాతంతో బతకలేక సామాన్యులు బెంబేలెత్తి పోతున్నారు. ఈ ధరలకు తోడు కరెంటు బిల్లులు, పెట్రోల్ బాదుడు కూడా అదనంగా వచ్చి చేరింది. మరింత అదనంగా జిఎస్టీ వాయిస్తోంది. ప్రభుత్వాలు ధరలను అరికట్టే చర్యలకు పూనుకోవడం లేదు. ధరలు పెరగడం సహజం అన్న ధోరణిలో ఉన్నారు. తమకు అందుబాటులో ఉన్న పెట్రోల్, గ్యాస్, విద్యుత్ తదితర వస్తువులపై వడ్డింపులు వేస్తూనే ఉన్నారు. ఎన్నికల్లో ధరలపై గట్టిగా మాట్లాడడం లేదు. దీనికితోడు జిఎస్టీ వడ్డింపులు శరాఘతంగా మారాయి. సామాన్యులు బతకడం దుర్లభంగా మారింది. ధరల పెరుగుదలను తలచుకుంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ఇంటి ఖర్చు సగటున నెలకు రూ.5వేలకు పైగా పెరిగింది. ప్రతి ఒక్కరిపైనా ఏటా 5 నుంచి 10 శాతం పెంపుతో అదనపు భారం తప్పదు. పంటలు దెబ్బతిని గ్రామాల్లో ఉపాధి కరవైంది. అటు పనుల్లేక, ఇటు ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. కందిపప్పు, మినపప్పు, పెసరపప్పుల ధరల్లో పెరుగుదల అధికంగా ఉంది. కరోనా సమయంలో ధరలు భారీగానే పెరిగినా తర్వాత కాస్త నెమ్మదించాయి. కొంతకాలంగా నిలకడగా సాగుతున్నాయి. గతంలో 3 నెలలకు రూ.333 ఉండే రీఛార్జ్.. ఇప్పుడు రూ.666కు చేరింది. దీనికి తోడు వై-ఫై రూపంలో నెలకు రూ.500 వరకు అదనపు భారం తప్పట్లేదు. కేబుల్ టీవీ ఖర్చు రూ.250 వరకు అదనం. ఒక్కో ఓటీటీ ఛానెల్‌కు సగటున రూ.500 చొప్పున నాలుగు తీసుకున్నా.. రూ.2 వేలు. అంటే నెలకు రూ.166 చొప్పున ఖర్చవుతుంది. ఒక్కో కుటుంబంపైనా మొబైల్, కేబుల్ బిల్లుల రూపంలోనే నెలకు రూ.600 వరకు అవుతోంది. వై-ఫై, ఓటీటీ తీసుకున్న కుటుంబాలకు నెలకు రూ.1,000 చొప్పున తప్పట్లేదు. 2019 మధ్యలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.600 వరకు ఉంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1150అయింది. అప్పటితో పోలిస్తే రాయితీ కూడా తగ్గిపోయింది. రూ.15 చొప్పునే నామమాత్రంగా ఇస్తున్నారు. నెలకు ఒక సిలిండర్ లెక్కన చూస్తే.. ఒక్కో కుటుంబంపై రూ.372 చొప్పున భారం పడుతోంది. ఇక పెట్రోల్, డీజిల్ ధరల గురించైతే చెప్పనక్కర్లేదు. చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులకు ద్విచక్రవాహనం భారమైపోయింది. నెలకు సగటున 25 లీటర్ల పెట్రోల్ లెక్కన చూసినా రూ.1,100 వరకు ఖర్చు పెరిగింది. 2019లో రూ.75లోపు ఉన్న పెట్రోల్ ధర.. ప్రస్తుతం రూ.121 వరకు చేరింది. లీటరుకు రూ.45కు పైగానే పెరిగింది. ఇంజిన్ ఆయిల్ ధర రూ.300 నుంచి రూ.500కు చేరింది. ఇప్పుడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో మరింత ఎగిశాయి. బ్రాండెడ్ టీపొడి ధర గతంలో కిలో రూ.540 ఉండేది. ప్రస్తుతం రూ.780 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం, యాలకులు, తులసి, అశ్వగంధ వంటి ఉత్పత్తులతో తయారయ్యే ఒక సంస్థ టీ పొడి.. 2019లో రూ.380 ఉండేది. ప్రస్తుతం రూ.800కు పైనే చేరింది. లీటర్ పాల ధర గతంలో రూ.55 నుంచి రూ.58 మధ్య ఉండేది. ఇప్పుడు సగటున రూ.64 నుంచి రూ.68 వరకు ఉంది. నెలకు 30 లీటర్లకు రూ.300 అదనంగా ఖర్చవుతోంది. సబ్బులు, డిటర్జెంట్ ఉత్పత్తుల ధరలూ.. 30 శాతం వరకు పెరిగినట్లు అంచనా. వీటికి తోడు ఇంట్లో వాడే ఒంటి సబ్బులు,ఫేస్‌క్రీమ్, షాంపూ ధరలూ రెట్టింపయ్యాయి. పాత్రలు కడిగే సబ్బు ధర మూడేళ్ల కిందట రూ.45 ఉంటే ఇప్పుడు అది 51 శాతం పెరిగి.. రూ.68కి చేరింది. టూత్‌పేస్ట్ ధర 2019లో రూ.79 ఉంటే.. ఇప్పుడు రూ.96 రూపాయలకు పైగానే ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాల వస్తువులపైనా ధరలు పెరిగాయి. ఉల్లిపాయల ధరలు 25కిలో దగ్గర స్థిరంగా ఉన్నాయి. అయితే ఈ ధరలపై పాలకులు పట్టించుకోవడం లేదు. వ్యాపారులు ఏ వస్తువు రేటు ఎందుకు పెంచుతున్నారో ఎవరికీ తెలియడం లేదు.

# విద్వేష ప్రసంగాలు నిషేధించాలి

**తొలి సమయం హైదరాబాద్,**

అన్ని పార్టీలది ఒకటే దారి. ఎన్నికల్లో ఓట్లు సంపాదించడం కోసం ఎదుటిపార్టీలపై బురదజల్లడం. లేని ఆరోపణలు చేయడం. విద్వేష ప్రసంగాలు చేయడం. ఈ కారణంగానే కెసిఆర్‌పై ఎన్నికల సంఘం 48 గంటల ప్రచార నిషేధం విధించింది. నిజానికి విద్వేష ప్రసంగాలు చేసే నాయకుడు ఎవరైనా నిషేధం విధించాలి. ఎన్నికల్లో తమ పార్టీ విధానాలు, ప్రజలకు ఏం చేయబోతున్నమో చెప్పాలే తప్ప..విద్వేష, అనవసర అపోహలు కలిగించే ప్రయత్నాలు చేయడం సరికాదు. ఇందులో రాజ్యాంగ సవరణ, రిజర్వేషన్ల రద్దు, వారసత్వ హక్కులపై పన్ను,ఎపిలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటి ఎన్నో అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఇవన్నీ కూడా ఎన్నికల్లో లబ్ది పొందేందుకు, ఎదుటి పక్షాన్ని ఇరకాటంలో పెట్టడానికి మాత్రమే పనికి వస్తాయి. ఇవేవీ అంత సులువుగా కార్యరూపం దాల్చే అంశాలు కావు. నిజానికి ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్యా కూడా ప్రచారంలో ప్రస్తావనకు రావడం లేదు. ప్రజల సమస్యలను విడిచి రాజకీయ పార్టీలు అధికారమే లక్ష్యంగా ఎన్నికల ఎజెండాను సెట్ చేస్తున్నారు. ఈ ప్రమాదాన్ని ప్రజలు గుర్తించాలి. ఇకపోతే కేవలం బిజెపి హిందుత్వాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పడం ద్వారా మైనార్టీ ఓట్ల కోసం వెంపర్లాడే బుజ్జగింపు రాజకీయాలను అన్ని పార్టీలు దూరం పెట్టాలి. నిజానికి మైనార్టీల సంతుష్టీ కరణతో విభజన రేఖలు గీస్తున్నది రాజకీయ పార్టీలే. ఇలా చేసే దేశ విభజన జరిగిందన్న విషయాన్ని మరచి పోరాదు. ఏ వర్గాన్నయినా మచ్చిక చేసుకునే క్రమంలో భ్రమలు కల్పించే ప్రయత్నాలు ఎవరు చేసినా నేరంగానే చూడాలి. అన్ని వర్గాలను సమానంగా చూసే రాజకీయాలు దేశానికి అవసరం. ఇప్పటికే మత ప్రాతిపదికన దేశం విచ్ఛిన్నం అయ్యింది. విభజన జరిగింది. ఈ క్రమంలో సమాజంలో జరుగుతున్న అకృత్యాలను ఎవరు చేసినా..చేపట్టినా నిర్ద్వందంగా ఖండించాల్సిందే. అఘాయిత్యాలను ఎత్తిచూపాల్సిందే. మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూసే దుస్థితి పోవాలి. వారిని ఈ దేశ సంస్కృతిలో భాగంగా చూడాలి. బిసిలు, నిమ్న కులాలను కూడా జనజీవన స్రవంతిలి కలిసి పోయేలా చూడాలే తప్ప వారిని వేరుగా చేసి చూసే రాజకీయాలను తిప్పికొట్టాలి. అలాగే సమస్యలను అజెండాగా చేసుకుని పోరాడితే తప్ప ప్రజలు నమ్మరని గుర్తించాలి. ప్రధానంగా ఈ దేశంలో కమ్యూనిస్టులు ఇంకా మేల్కోవడం లేదు. పడికట్టు పదాలతో ప్రజలను భ్రమల్లో పెట్టి రాజకీయ పబ్బం గడపాలనుకోవడం తప్పుకాక మరోటి కాదు. ప్రజల్లో ఐక్యతా నినాదాన్ని తీసుకుని రావాలి. కలసి పనిచేయాలన్న సంకల్పంతో ముందుకు సాగితే తప్ప ప్రజలు నమ్మరు. సమస్యపై పోరాటం ప్రాతిపదికగా కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలి. అంతేగాని హిందుత్వ పేరుతో రాజకీయాలు చేయడం మానాలి. పార్లమెంట్ ఎన్నికలు లక్ష్యంగా రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలు, ప్రకటనలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు జుగుప్స కలిగిస్తున్నాయి. ఈ రకమైన భావజాలంతో ముందుకు సాగితే విపరీత పరిణామాలు రావచ్చు. భారతదేశంలో మాత్రమే ప్రజలంతా కలసిమెలసి జీవించే విధంగా ముందుకు సాగుతున్నారు. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం అవసరం. అందుకు పార్టీలు విభేదాలు పక్కకు పెట్టి సమస్యలను ఎజెండాగా చేసుకుని ముందుకు సాగాలి. భాజపా వ్యతిరేక గళాలు ఒకేతాటి మీదికి రావాలన్న ఆకాంక్ష బలంగా వినిపిస్తున్నా కార్యరూపంలోకి రావడం లేదు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు, మేధావులు, సిద్ధాంత కర్తలు, మైనారిటీలు, దళితులందరూ ఒకే వేదిక మీదకు రావడంపై తక్షణం దృష్టిపెట్టాల్సి ఉంది. ఎంతసేపు ఆర్ఎస్ఎస్ చేతుల్లో కేంద్రం కీలుబొమ్మ గా మారిందనీ..మోదీ సర్కారు నియంతృత్వ విధానాలను అవలంబిస్తోందని, హిందుత్వ విధానాలు అవలంబిస్తోందని దుయ్యబడుతున్న తీరు సరికాదు. సమస్యలపై నిలదీయాల్సిన పార్టీలు, లేదా నేతలు రాజకీయ స్వలాభం కోసం బట్టకాల్చి మీద వేసే ప్రయత్నాలు మానుకోవాలి. మతోన్మాదం విషయంలో లెఫ్ట్ రెండు నాల్కల ధోరణిని విడనాడాలి. హిందువులు ఏదైనా చేస్తే దానిని తీవ్రంగా పరిగణించి హిందూ మతోన్మాదం అన్న ముద్ర వేస్తున్నారు. ముస్లిం తీవ్రవాదాన్ని మాత్రం గట్టిగా ఖండిం చడంలో నాలుకలు మడతపడేస్తున్నారు. ఈ జాడ్యం నుంచి వారు బయటపడక పోవడంతో హిందువుల్లో ఆయా పార్టీల పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతోంది.

# కిసాన్ సమ్మాన్‌కు తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య

**రేషన్‌కార్డులో ఒక్కరికి మాత్రమే వర్తింపు**

**రూ.10 వేల పెన్షన్ అందుతున్నా అంతే**

**ఇన్‌కంట్యాక్స్ రిటర్న్స్ దాఖలు చేసినా మాయం**



**జగిత్యాల** రైతుబంధు.. ఈ పేరు వింటే వెంటనే కేసీఆర్ గుర్తొస్తారు. పెట్టుబడి సాయం కింద రైతులకు అందించే సాయం ఐక్యరాజ్యసమితి ప్రశంసలు సైతం అందుకుంది. సమయం రాగానే టంచన్‌గా రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. వాటిని పెట్టుబడిగా పెట్టుకుని అన్నదాతలు సంతోషంగా పంటలు సాగుచేసేవారు. కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేసిన రైతుబంధు పథకాన్ని స్ఫూర్తిగా తీసుకున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 2018 డిసెంబర్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ఓ పథకాన్ని తీసుకొచ్చింది.ఇందులో భాగంగా ఐదెకరాల లోపు భూమి ఉన్న చిన్నసన్నకారు రైతులకు ఏడాదికి 6 వేల రూపాయలను మూడు విడతల్లో అంటే ఏప్రిల్, ఆగస్టు, డిసెంబర్ మాసాల్లో అందిస్తామని ప్రకటించింది. నాడు అట్టహాసంగా ప్రారంభించిన ఈ పథకం ఇప్పుడు చిక్కిశల్యమవుతున్నది. అర్థంపర్థంలేని ఆంక్షలు రుద్దుతూ లబ్ధిదారులను ఒక్కొక్కరుగా తొలగిస్తున్నది. నాడు కేసీఆర్ హయాంలో ఒక్కటంటే ఒక్క నిబంధన కూడా లేకుండా స్వేచ్ఛగా పథకాన్ని అనుభవించిన అన్నదాతలు కిసాన్ సమ్మాన్ విషయంలో మాత్రం ఆంక్షల వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు.

### సగానికి సగం తగ్గిన లబ్ధిదారులు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ రైతుబంధు పేరుతో పంటసాయంగా ఎకరానికి రూ. 5 వేల సాయాన్ని ప్రకటించారు. రైతు సంక్షేమం, పెట్టుబడి సాయం కోసం అమలు చేసిన ఈ పథకంపై ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసలు కురిపించింది. పథకం ప్రారంభించిన తర్వాత ప్రతి ఏటా లబ్ధిదారుల సంఖ్య పెరుగుతూ వచ్చింది తప్పితే తగ్గింది లేదు. అదే సమయంలో కేంద్రం తీసుకొచ్చిన కిసాన్ సమ్మాన్ మాత్రం ఏడాదికేడాది బక్కచిక్కిపోతున్నది. 2019-20 సంవత్సరంలో 8.23 కోట్లు ఉన్న లబ్ధిదారుల సంఖ్య 2023-24లో 7.56 కోట్లకు పడిపోయినట్టు గణాంకాలు చెప్తున్నాయి. ఒక్క జగిత్యాల జిల్లాలోనే లబ్ధిదారుల సంఖ్య వేలల్లో పడిపోయింది. డిసెంబర్ 2018లో ఈ పథకం ప్రారంభం కాగా, జిల్లాలో 1,44,545 మంది రైతులకు రూ.28.91 కోట్ల పంటసాయం అందింది. నిరుడు ఆగస్టులో 15వ క్వార్టర్ నాటికి లబ్ధిదారులకు అందిన సాయం రూ. 14.23 కోట్లకు పడిపోయింది.అంటే ఈ మధ్యకాలంలో ఏకంగా 51 శాతం మంది లబ్ధిదారులను అంటే 73,405 మంది రైతులను వివిధ కారణలను సాకుగా చూపి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పరిధి నుంచి తొలగించారు.

### పెరుగుతూ పోయిన రైతుబంధు సాయం

కేంద్ర సర్కార్ ఇచ్చే పంట సాయం రోజురోజుకూ చిక్కి శల్యమైతే, రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతుబంధు సాయం మాత్రం అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. 2018లో అప్పటి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు ప్రారంభించింది. జగిత్యాల జిల్లాలో మొదటి ఏడాది 1,76,928 మంది రైతులకు రెండు దఫాల్లో రూ.310.97 కోట్ల పంట పెట్టుబడిని రైతుబంధు కింద అందజేసింది. ఈ సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతూ వచ్చింది.

# ప్రశ్నించే గొంతుక కావాలి!

**తొలి సమయం హైదరాబాద్,**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఉంటుంది..ఓటుకు విలువా ఉంటుంది. అందుకే భారత ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న విలువ మరేదేనికి లేదు. ఓటుకు విలువ ఉందికాబట్టే రాజకీయ పార్టీలు, నేతలు మనచుట్టూ తిరుగుతున్నారు. దీనినిబట్టి మన ఓటు చాలా విలువైనదని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మనం వేసే ఓటు దేశాన్ని కాపాడగలదు..దేశాన్ని బలోపేతం చేయగలదు. మన రాతను మార్చగలదు...కాబట్టి ఓటు వేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్దంగా ఉండాలి. నాకెందుకు లే అన్న నిర్లిప్తత నుంచి మనమంతా బయట పడాలి. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయకుండా నిర్లిప్తత పాటించడం, పోలింగ్ కేంద్రాలకు వెళ్లక పోవడం అన్నది నేరంగానే చూడాలి. బాధ్యతారహిత చర్యగా చూడాలి. మనం వేసే ప్రతి ఓటు దేశహితం కోరేదని గుర్తించాలి. అందుకే ఓటును ఆచితూచి, ఆలోచించి అర్హులైన వారికే వేయాలి. మనకెవ్వరూ నచ్చలేదని నిర్లక్ష్యంగా ఉండరాదు. మనకు ఉన్న ఎన్నికల వ్యవస్థ బహుశా ప్రపంచంలో ఏ దేశంలోనూ లేదు. ప్రజాస్వామ్య దేశాల చరిత్రలో ఎన్నికలు ప్రాముఖ్యత గల ఘట్టం. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది స్వేచ్ఛ, సమానత్వం, న్యాయాలను సాధించే ఏకైక ప్రభుత్వ రూపం కాబట్టి చాలా విలువైనది. ఇవన్నీ మంచి సమాజానికి చాలా ముఖ్యం. ప్రజలను, ఒక వ్యక్తి నిరంకుశత్వం కంటే కూడా రాజ్యాంగమే పాలిస్తుంది. పౌరులుగా, మానవులుగా మన హోదాను ప్రాథమిక హక్కులు రక్షిస్తాయి. అదే సందర్భంలో రాజకీయా నేతలకు అధికారాన్ని కూడా కట్టబెడతాయి. ఓ మంచి వ్యక్తి చేతిలో ప్రజాస్వామ్యం ఉంటే అది మరింత బలపడుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది. ఈ నేపథ్యం అధికారం కోసం ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలతో పాటు, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటి వరకు గతంలో పాలించిన పాలకులు మంచిచెడులను విశ్లేషించి మనమంతా ఓటేయాలి. తప్పకుండా ఓటేయాలి. మన పక్కన ఉండేవారిని ఓటేసేలా చేయాలి. 2024 ఎన్నికల షెడ్యూల్ లో ఇప్పటికే రెండు దఫాల ఎన్నికలు ముగిసాయి. కొందరు ఓటు వినియోగించుకోగా, కొందరు ఇంకా వినియోగించుకోవాల్సి ఉంది. ప్రజాస్వామిక మూల స్తంభాలు బలపడాలంటే..మన సమాజంలో మనం బలంగా ఉండాలంటే ఓటు హక్కును వినియోగించుకోవాలని గుర్తించాలి. ప్రజలు ఎవరు ఆదరించారు... ఎవరు నిర్లక్ష్యం చేశారు..ఎవరు చిత్తశుద్ధిగా పనిచేశారన్నదే ప్రాతిపదికగా మనం ఓటును వినియోగించు కోవాలి. ఇప్పుడు మనకు కేవలం ఓటు హక్కు మాత్రమే ఉంది. రాజకీయ ప్రసంగాలతో మోసపోకుండా, ఆచరణల్లో నిజాయితీని ప్రదర్శించిన పార్టీలనే ఎన్నుకునేందుకు మనం ఓటును ఉపయోగించుకుంటే అది ఒకశక్తిగా పనిచేస్తుంది. అందుకే పేదలపేరు చెప్పి అధికారం అనుభవించే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. ఖజానాను గుల్లచేసేవారిపట్లా అప్రమత్తంగా ఉండాలి. ఇబ్బడిముబ్బడిగా ప్పులు వేస్తూ పోయే పాలకుల పట్లా మనం అప్రమమత్తగా ఉండాలి. మనం వేసే ఓటు మనకూ బాణంలా గుచ్చుకుఓకుండా చూసుకోవాలి. పేదలు పేదలుగానే ఉన్నారు. పేదరికం, పేదల పేర్లు చెప్పి ఇంకెంతకాలం మనం జీవితాలు గడపాలి. పాలకుల నిర్ణయాలకు మనమెందుకు బలికావాలి. వారి విలాసాలకు మనమెందుకు కారణం కావాలి. మనోటుతో మన కంట్లో పోడిచే నాయకులు మనకెందుకో ఆలోచించాలి. చాలామంది భారతీయులు ఇంకా పేదరికం నుండి బయటపడనే లేదు. పాలకలు విధానాల కారణంగానే వీరంతా పేదరికం అనుభవిస్తున్నారు. ఎనభై మూడు కోట్ల మంది భారతీయులకు ఉచిత రేషన్ పంపిణీ చేశామని ప్రధానమంత్రి చెబుతున్నారు. నిజానికి వీరంతా ఇంకా ఎ ందుకు పేదరికంలో మగ్గుతున్నారో ఎందుకు గుర్తించడం లేదు. తినడానికి తిండిని సంపాదించుకోలేని స్థితిలో ఇంకా వారు ఎందుకు ఉన్నారని ఆరా ఎందుకు తీయడం లేదు. ఇంకా దేశంలో పేదరికానికి, అనారోగ్యానికి కారణాలు ఆహారమే.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101